



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com


అన్నమయ్య

గురువారం | 25 సెప్టెంబర్ 2025

పేజీలు 8


# ఆర్టీఐతో మేలా...? కీడా?




◆ సమాచార హక్కు దరఖాస్తులను తుక్కులెక్క చూస్తున్న రెవెన్యూ అధికారులు

◆ ఆర్డీఓలు, ఐఏఎస్ ఆఫీసర్లు శిక్షించబడ్డా అధికారుల్లో కానరాని మార్పు

◆ కొత్త కలెక్టర్ దృష్టి సారించాలి

**అన్నమయ్య జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్:** ఏదైనా ఒక చట్టం ఉందంటే అది అమలులో ఉండాలి. లేదంటే దానివల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువగా ఉంటుంది. అన్నమయ్య జిల్లాలో సమాచార హక్కు చట్టం పరిస్థితి ఇలాగే ఉంది. కబ్జాలకు పేరుగాంచిన అన్నమయ్య జిల్లాలో ఆర్టీఐ అమలు కాకపోవడానికి ఎలా చూడాలో అర్థం కాని పరిస్థితి తలెత్తింది. రెవెన్యూ యంత్రాంగం ప్రభుత్వ, ప్రజల ఆస్తులను రక్షించడానికి పని చేయడం లేదని, వాటిని భక్షించే వాళ్లను రక్షించడానికి పని చేస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. భారతదేశం లో ప్రభుత్వ అధికారుల ధోరణి "చెప్పేవాడికి వినేవాడు లోకువ" అన్న చందంగా ఉండేది. కానీ "అడిగేవాడికి చెప్పేవాడు లోకువ" అయితేనే బాగుంటుందని భావించిన కొందరు పెద్దలు సమాచారం పొందడాన్ని హక్కుగా మార్చాలని ప్రయత్నించి విజయం సాధించారు. ఫలితంగా 2005లో సమాచార హక్కు చట్టం వచ్చింది. కానీ అడిగేవాళ్లు దాన్ని సక్రమంగా వినియోగించుకోవడం లేదు. ఫలితంగా మళ్లీ "చెప్పేవాడికి వినేవాడు లోకువ" అయ్యాడు. అన్నమయ్య జిల్లాలో రెవెన్యూ అధికారులను ప్రజలు, బాధితులు, సమాజ హితులు ఎన్నో ప్రశ్నలు అడుగుతున్నారు. భూముల వివరాలు, అధికారుల నిర్ణయాలు, నిధుల వినియోగం, అభివృద్ధి పనుల వాస్తవ స్థితి గురించి తెలుసుకోవాలని, పదిమందికి తెలియజేయాలని, అవకతవకలపై పోరాడాలని కూడా చూస్తున్నారు. కానీ రెవెన్యూ అధికారుల నుంచి సమాధానాలు రాకపోవడం, లేదా తప్పుదోవ పట్టించే రీతిలో రావడం వల్ల ఆర్టీఐ చట్టం ఉన్నా లేకున్నా ఒకటే కదా?" అనే పరిస్థితి ఏర్పడింది.

**ఈ చట్టం లేనప్పుడే బాగుండేదా?**

2005లో పారదర్శక పాలన కోసం తెచ్చిన సమాచార హక్కు చట్టం (%=×%) అసలు ఉద్దేశ్యం ఏమిటంటే ప్రజలు ప్రభుత్వానికి యజమానులు అన్న భావనను బలపరచడం. కానీ అన్నమయ్య జిల్లా వాస్తవాలు చూస్తే, చట్టం సజీవంగా అమలవ్వడం లేదు. సమాచారం అడిగితే సమాధానం ఇవ్వకుండా కాలాన్ని హరించడం, తప్పుడు వివరాలు ఇవ్వడం నిత్యకృత్యం అవుతోంది. ఈ నిర్లక్ష్యం లిఆర్టీఐ చట్టం సెక్షన్ 7(1), 20(1)లిల ప్రకారం శిక్షార్హమైన తప్పు. అయినా అధికారులు ఎప్పుడూ నిరభ్యంతరంగా అదే ధోరణిని అవలంభిస్తున్నారు. ఇలా అయితే, చట్టం రాకముందు ఉన్న అపారదర్శక పరిస్థితి, ఇప్పటికీ కొనసాగుతోందన్న భావన బలపడుతోంది. పైగా చట్టం లేనప్పుడు కొన్ని వివరాలు తెలుసుకోవడం మాత్రమే కష్టంగా ఉండేది. ఇప్పుడు ఏ వివరం కావాలన్నా సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోమంటున్నారు. రాజంపేట తహసీల్దారు కార్యాలయంలో అయితే అవసరమైన ఏ పేపరూ ఇవ్వడం లేదు. జర్నలిస్టులు సమాచారం కోసం అడిగినా ఆర్టీఐ కింద అప్లయ్ చేసుకోపొమ్మంటున్నారు. అలా అయితే వాళ్లు ఇచ్చేదెప్పుడు మేము వార్తలు రాసేదెప్పుడు? అని జర్నలిస్టులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టం లేనప్పుడే జర్నలిస్టుల పరిస్థితి బాగుండేదని, అధికారులు సమాచారం ఇచ్చేవారని సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.

**సమాచారం రాకపోతే నష్టం ఎవరికి ?**

ప్రజలు సమాచారం పొందకపోవడం వల్ల అభివృద్ధి పనుల్లో అవినీతి దాగిపోతుంది. భూమి రికార్డుల్లో లోపాలు, తప్పుడు రికార్డులు, నిధుల వినియోగం లాంటివన్నీ గోప్యంగా ఉండిపోతున్నాయి. సమాచారం ఇవ్వని అధికారులు పెనాల్టీ చెల్లించి, పదవిలో నుంచి తొలగింపబడిన కేసులు దేశంలో అనేకం ఉన్నాయి. గుజరాత్‌లో ఒక తహసీల్దార్ ఉద్యోగం కూడా కోల్పోయాడు. ఇలాంటి సంఘటనలు అన్నమయ్య జిల్లాలో కూడా చోటుచేసుకుంటేనే ఇక్కడ మార్పు మిగతా 2లో

## రోడ్ల అభివృద్ధికి చేయూతను అందించండి

### -రాజంపేటకు రహదారులు చాలాకీలకం

### -బీసీ జనార్దన్ రెడ్డికి చమర్తి వినతి

**రాజంపేట,మేజర్ న్యూస్:** రాజంపేట నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి పెద్ద ఎత్తున చేయూతను అందిస్తే రాజంపేట నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందని రాష్ట్రమంత్రి, అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి రాజంపేట టిడిపి ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు విన్నవించారు. బుధవారం అమరావతిలో మంత్రిని కలసి పలు విషయాలపై వినతి పత్రం అందజేసి చర్చించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా రాజంపేట నియోజకవర్గంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉందని, ముఖ్యంగా వైసిపి పాలనలో గ్రామీణ ప్రాంతాలకు రహదారులే లేకుండా పోయాయని, ఏనాడు గుంతలను పూడ్చడం కానీ, తట్టడు మట్టి వేయడం కానీ చేయలేదని, అయితే ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వానికి మిగతా 2లో





## దుర్గామాత సన్నిధిలో దాసరిపల్లి కల్పనా రెడ్డి

**ములకలచెరువు, మేజర్ న్యూస్:** బి.కొత్తకోట పట్టణంలో దేవి నవరాత్రుల సందర్భంగా మూడవరోజు దుర్గామాత నవరాత్రుల ఉత్సవాలలో తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డి సతీమణి కల్పనరెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కల్పనా రెడ్డి నియోజకవర్గ ప్రజలు ఎల్లవేళలా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ అమ్మవారికి పట్టుచీర మరియు రూ. 50,000 నగదు విరాళం అందజేసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అత్తిరాల దేవస్థానం నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం

**రాజంపేట,మేజర్ న్యూస్:** రాజంపేట నియోజకవర్గ పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ శ్రీ శ్రీ కామాక్షి త్రేతేశ్వర స్వామి ఆలయ కమిటీ నేడు బుధవారం అత్తిరాల దేవస్థానం నందు చైర్మన్‌గా పూల నాగమణి, ఎక్స్ అఫీషియల్ సభ్యులుగా పద్మనాభ శాస్త్రి, ఆలయ ధర్మకర్తల మండల సభ్యులు రమాదేవి, వెంకటేశ్వర్ల నాయుడు, భారతి, కడప నరసింహులు, ముమ్మిడి చిన్నయ్య, వేణు మాధవ్ వర్మ, కే రమేష్, వారి చేత ఆలయ ఇన్స్పెక్టర్ జనార్దన్ ప్రమాణ స్వీకారం చేయించడం జరిగినది. అనంతరం చైర్మన్ ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వంలో మన రాజంపేట టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. అంతేకాకుండా ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పలువురు టిడిపి ముఖ్య నాయకులు పూజారులు, భక్తులు పాల్గొన్నారు.



సూర్య
www.suryaa.com
గురువారం
25 సెప్టెంబర్ 2025

## మిట్స్ యూనివర్శిటీలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం

**- కళాశాల పరిసరాలను శుభ్రం చేసిన ఎన్ఎస్ఎస్,ఎన్.సి.సి విద్యార్థులు**



**కురబలకోట,మేజర్ న్యూస్ :** మదనపల్లె సమీపంలోని మిట్స్ (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు ఎన్.సి.సి విద్యార్థులు బుధవారం 'స్వచ్ఛత హీ సేవ' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇందులో భాగంగా విద్యార్థులు యూనివర్సిటీ పరిసరాల పరిశుభ్రత కోసం చెత్తను శుభ్రం చేసినారు.ఈ సందర్భంగా యూనివర్సిటీ యెన్.సి.సి లెఫ్టినెంట్ డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి మరింత ఊపునిస్తూ పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ 'స్వచ్ఛత హీసేవ ఉద్యమా'నికి శ్రీకారం చుట్టారన్నారు.ఈ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహిస్తారని తెలిపారు.ప్రతి ఒక్కరూ స్వచ్ఛత ఉద్యమంలో భాగం పంచుకోవాలని,ప్రతి గ్రామం,వీధి,పట్టణం,పరిసరాలు అంతటా స్వచ్ఛతను పాటించాలని మనమంతా కలిసి బాపు కలలను సాకారం చేద్దామని విద్యార్థులకు పిలుపునిచ్చారు.పరిసరాల శుభ్రత లేకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉండటం సాధ్యం కాదని,స్వచ్ఛ భారత్ ఉద్యమాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లడం ద్వారా రోగాల వ్యాప్తిని అరికట్టవచ్చునని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి మరియు ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యర్థుల దాడి: వృద్ధ రైతు ఆత్మహత్యాయత్నం



**మదనపల్లి టౌన్, మేజర్ న్యూస్ :** భూ వివాదంతో తలెత్తిన గొడవలో ప్రత్యర్థులు దాడి చేశారన్న కోపంతో ఓ వృద్ధుడు పురుగు మందు తాగి ఆత్మ హత్యకు యత్నించాడు. ఈ సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసులు, బాధితుని కుటుంబీ కులు తెలిపిన వివరాల మేరకు పోలీసుల కథనం.. మండలంలోని యనమలవారిపల్లికి చెందిన కోలా రెడ్డప్ప (80)కి చెందిన వ్యవసాయ భూమిలో భాగం పంచాలని అదే ఊరికి చెందిన ప్రత్యర్థులు వేణు వర్గీయులు రెడ్డప్ప పొలం వద్దకు దౌర్జన్యంగా వెళ్లి గొడవపడ్డారు. మాట మాట పెరిగి వృద్ధ రైతు రెడ్డప్ప పై కర్రల తో దాడి చేసి తీవ్రంగా గాయ పరిచారు. దాడిని అవమానంగా భావించి తీవ్ర మనస్థాపం చెందిన రైతు పొలం వద్ద ఉన్న పురుగు ల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు గమనించి బాధితున్ని వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి, చికిత్స అనంతరం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడి నుంచి రుయాకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

## భూ బకాసురులను నిరోధించేవారే లేరా ?

**ఓబులవారిపల్లె మేజర్ న్యూస్:** ఓబులవారిపల్లె మండలం బాలిరెడ్డిపల్లి వై కోట గ్రామపంచాయతీ పరిధిలలో ఉన్న భూ బహసురులు దిన దినానికి పెరిగి నిరుపేదలకు దక్కవలసిన ప్రభుత్వ బంజర భూములను వందల ఎకరాలు ఆక్రమించి అనుభవిస్తుంటే ఆ భూ బకాసురులను నిరోధించేవారే లేరా అని పేదలు ఒకింత నిరుత్సాహాన్ని వెలిబుచ్చుతున్నారు.అదేవిధంగా నిరుపేద దళిత గిరిజనులు ముస్లిం మైనార్టీలకు ఎప్పుడు ప్రభుత్వ భూములను పంచుతారని బుధవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఓబులవారిపల్లి మండల కార్యదర్శి మల్లిక వెంకటరమణ ఆధ్వర్యంలో రెవెన్యూ తాసిల్దార్ కార్యాలయం ధర్నా కార్యక్రమం చేపట్టి డిప్యూటీ తాసిల్దార్ సిద్దేశ్వర రావుకి వినత పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ పందు గోలమణి, రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి ఎం జయరామయ్య హాజరైన సందర్భంగా వారు మాట్లాడుతూ బాలిరెడ్డిపల్లి, గ్రామపంచాయతీ వై కోట పొలం సర్వేనెంబర్ 1155,1294 గల నెంబర్లలో దాదాపు 150 ఎకరాలు ప్రభుత్వ బంజర భూమిని నిరుపేద దళిత గిరిజన ముస్లిం మైనార్టీలు గతంలో చెట్లును రాళ్లను తొలగించి లక్షల రూపాయలు అప్పులు చేసుకున్నారని గతంలో ఉన్న రెవెన్యూ తహసిల్దార్ కార్లు కలెక్టర్లు సబ్ కలెక్టర్లు వచ్చి ఆ భూమిని పరిశీలించి అసైన్ కమిటీలో మీకు ఇస్తాము అని చెప్పడం జరిగిందన్నారు. అయితే కొంతమంది ఇప్పుడున్న రాజకీయ బడా నాయకులు ఆ భూమి పైన కన్నుబడి నిరుపేద దళిత గిరిజనులకు దక్కకుండా కబ్జా చేయాలని చూస్తున్నారని అన్నారు. తక్షణమే నిరుపేద దళిత, గిరిజన ముస్లిం మైనార్టీలకు ఆ భూమిని ప్రతి కుటుంబానికి రెండు ఎకరాలు పంచకపోతే వచ్చే అక్టోబర్ 13వ తేదీ నుండి స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట దశలవారీగా సామూహిక నిరాహార దీక్షలు చేపడతామని వారు తీవ్రంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు ఓబులవారిపల్లి మండల నాయకులు కటారి గోపాలు, శుభరాఘవులు బాలాజీ నగర్, శివాజీ నగర్ గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీఐతో మేలా, కీడా?

**(మొదటి పేజీ తరువాయి)**ఆశించవచ్చు. భూకబ్జాలకు, దొంగ రికార్డులకు పేరు మోసిన అన్నమయ్య జిల్లాలో ఆర్టీఐని సక్రమంగా అమలు చేయించే బాధ్యతను ప్రభుత్వం భుజాన వేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే రెవెన్యూ అధికారుల వైఖరి ఇలా ఉండటం వల్ల భూకబ్జా లు పెరిగిపోతున్నాయి. పౌరులు అభివృద్ధి ఫలితాలు అందుకోలేకపోతున్నారు. అవినీతిపరులు మాత్రం లాభపడుతున్నారు. ఇది చూసి పలువురు అదే బాట పడుతున్నారు.

**జర్నలిస్టుల సమస్యపై కలెక్టర్ దృష్టి సారించాలి**

దేశవ్యాప్తంగా ఎన్నో భూ మాఫియా, కాంట్రాక్ట్ మోసాలు ఆర్టీఐతో బయటపడ్డాయి, ఆగిపోయాయి. అన్నమయ్య జిల్లాలో కూడా పలు ఫిర్యాదులు వెలుగులోకి వచ్చాయి. కానీ జర్నలిస్టులు ఆ ఆధారాలను సేకరించి కథనాలు రాయకపోతే సమాజానికి మేలు చేసే అవకాశమే లేకుండా పోతుంది. అవినీతి, అక్రమాల గురించి తెలిసి కూడా ఆధారం లేక ఆగిపోయే కథనాలు ఎన్ని ఉన్నాయో జర్నలిస్టులకే తెలుసు. అందువల్ల జర్నలిస్టులు ఏదైనా సమాచారం అడిగితే ఆర్టీఐ అని చెప్పి తప్పించుకోకుండా వెంటనే ఇచ్చేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరుతున్నారు. అధికారులు ఇబ్బందిపడే పరిస్థితులు నిజంగా ఉంటే సీలు, సంతకంతో ధృవీకరించకుండా అయినా సమాచారం ఇప్పించాలంటున్నారు.

## అట్టహాసంగా హౌస్ ఆఫ్ తీరాది బోటిక్ ప్రారంభం

**ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి – ఘన స్వాగతం పలికిన సీపీ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు**



మదనపల్లె టౌన్,మేజర్ న్యూస్ : మదనపల్లి పట్టణం,సొసైటీ కాలనీలో వైసీపీ సీనియర్ నేత సిపి సుబ్బారెడ్డి కుటుంబీకులచే బుధవారం హౌస్ ఆఫ్ తీరాది బోటెక్ ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి హాజరయ్యారు.మహిళలకు అవసరమైన,నాణ్యమైన ప్రీమియం శారీస్,కుర్తిస్,లెహంగాస్,డ్రెస్ మెటీరియల్స్ వంటి దుస్తులను అందుబాటులోకి ఉంచారు.సూరత్ నుండి ఈ దుస్తులను కొనుగోలు చేసి మదనపల్లిలో అమ్మకానికి ఉంచారు.తక్కువ ధరలకు నాణ్యమైన చీరలు,కుర్తిస్,డ్రెస్ మెటీరియల్స్ ను కొనుగోలుదారులకు అమ్మకానికి ఉంచారు.హౌస్ ఆఫ్ తీరాది బోటెక్ ను ఆదరించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి పట్టణ ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో అంగళ్లు సర్పంచ్ పోరెడ్డి విశ్వనాథ్ రెడ్డి,ఎన్నారై మాధవరెడ్డి,వైసిపి యువ నాయకులు ముట్ర దామోదర్ రెడ్డి,సీనియర్ పాత్రికేయులు జీవి శివారెడ్డి,కోదండరామిరెడ్డి,వివి రాజు,బంధువులు సిపి రాఘవరెడ్డి,సిపి ప్రకాష్ రెడ్డి,సిపి రేణుకమ్మ,సిపి భాగ్యమ్మ పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్ ఆదేశాలను ధిక్కరిస్తూ మసీదు అక్రమ నిర్మాణం

**ఎమ్మార్వోకి వినతి పత్రం అందజేత**

**సుండుపల్లె మేజర్న్యూస్ :** సుండుపల్లి మండలం అక్కంపల్లి గ్రామ లోని జగనన్న కాలనీ నందు అక్రమంగా మసీదు నిర్మాణం చేస్తున్నారని సబ్ కలెక్టర్ ఆదేశాలను ధిక్కరిస్తూ మళ్లీ అక్రమ నిర్మాణాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తున్నారని ఎమ్మార్వో మహబూబ్ చాంద్ కి జగనన్న కాలనీ వాసులు వినతి పత్రాన్ని అందజేశారు. వివరాల్లోకెళితే స్థలం ఇల్లు లేని లబ్ధిదారులకు గత ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలాన్ని చూపిస్తూ ఇల్లు నిర్మాణం చేసుకునే విధంగా గత ప్రభుత్వం అనుమతులు మంజూరు చేస్తే లబ్ధిదారులకు కాకుండా మరొకరు దౌర్జన్యంగా మసీదులను నిర్మిస్తూ లబ్ధిదారుల యొక్క కడుపుని కొడుతూ మత కలహాలను సృష్టించే విధంగా వ్యవహరిస్తున్నారని జగనన్న కాలనీ వాసులు ఎమ్మార్వోకి ఫిర్యాదు చేశారు. ఎమ్మార్వో వివరణ : జగనన్న కాలనీలలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అలా నిర్మాణాలు చేపట్టి మతకలహాలు సృష్టించేతే క్రిమినల్ కేసులో నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో మహబూబ్ చాంద్ తెలిపారు.

## ఆర్సిడిఎస్ సొసైటీతో కలిసి రెడ్ల సంక్షేమం,అభ్యున్నతికి కృషి

**– మదనపల్లె రెడ్డి సంక్షేమ సంఘం తీర్మానం**



**మదనపల్లె,మేజర్న్యూస్ :** ఆర్.సి.డి.ఎస్ సొసైటీతో కలిసి రెడ్ల అభ్యున్నతికి కృషి రెడ్డి సంక్షేమ సంఘం తీర్మానించింది.మదనపల్లి రెడ్డి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం బెంగళూరు రోడ్డులోని రెడ్డి సంక్షేమ సంఘం భవనం నందు బుధవారం అధ్యక్షులు గుడిబండ రవికుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.రెడ్ల సంక్షేమంపై పలు అంశాలను సెక్రెటరీ డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి సమావేశంలో వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ (ఆర్.సి.డి.ఎస్) రాష్ట్ర అధ్యక్షులు యరపురెడ్డి సురేందర్ రెడ్డి,రాష్ట్ర మహిళా కో–ఆర్డినేటర్ పద్మప్రియా రెడ్డిలు తమను సంప్రదించి రెడ్డి సంక్షేమ సంఘం భవనంను వారి సంస్థకు అప్పగిస్తే నిరుపేద రెడ్డి విద్యార్థులకు వసతి మరియు విద్య భోజనం ఉచితంగా అందిస్తామని తెలియజేశారన్నారు.భవనా న్ని ఉచితంగా వారికి అప్పగించేందుకు కార్యవర్గ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదిం చడం జరిగిందన్నారు.రెడ్ల సంక్షేమం,అభివృద్దే లక్ష్యంగా మదనపల్లి రెడ్డి సంక్షేమ సంఘం పనిచేస్తోందన్నారు.రెడ్లని ఏక తాటిపైకి తీసుకొచ్చి సంఘాన్ని మరింత బలంగా తయారు చేస్తామని వారు స్పష్టం చేశారు.అనంతరం సంఘం సెక్రెటరీ డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపు కొన్నారు.ఇందులో భాగంగా కేక్ కట్ చేసి,శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ వి.సాంబశివరెడ్డి,జాయింట్ సెక్రెటరీ కే.సుధాకర్ రెడ్డి,ట్రెజరర్ గిరిధర్ రెడ్డి,లీగల్ సలహాదారులు వై.శేషారెడ్డి,కో–ఆర్డినేటర్ ఎన్.సాంబశివా రెడ్డి మరియు కార్యవర్గ సభ్యులు జి.మస్తాన్ రెడ్డి,వై.నాగేశ్వర్ రెడ్డి,తట్టి శ్రీనివాసులురెడ్డి, శేషాద్రి రెడ్డి ,ఆర్. సుబ్బారెడ్డి, జి.నారా యణరెడ్డి, సి.భాస్కర్ రెడ్డి,ఎం.సుబ్రహ్మణ్యం రెడ్డి,వై.నాగ సుబ్బారెడ్డి,ఎన్.భాస్కర్ రెడ్డి,జి.కోదండరామిరెడ్డి,చిప్పిలి మల్లికార్జున రెడ్డి,ఎస్. మాధవరెడ్డి, ఎ.రంగారెడ్డి,ఎస్.మస్తాన్ రెడ్డి,వై.శరత్ రెడ్డి,కే.వేణుగోపాల్ రెడ్డి, బి.జనార్ధన్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.






## ఘనంగా జాతీయ సేవ పథకం దినోత్సవం..

**ములకలచెరువు, మేజర్ న్యూస్:** ములకలచెరువు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ డే జాతీయ సేవ పథకం దినోత్సవం ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా కాలేజీ నుండి మూడు రోడ్లు కూడలి వరకు నినాదాలు చేస్తూ విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీగా వెళ్లారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకొని సమాజానికి మార్గదర్శకులు కావాలని అన్నారు. ఎలాంటి ప్రతిఫలం లేకుండా సేవా చేయడమనేది విద్యార్థి యొక్క గుణంగా అలవర్చుకోవాలని మనుషులకి, సమాజానికి సేవ చేసి ఇతరులకి మార్గదర్శకంగా నిలవాలని, విద్యార్థుల సేవా గుణంతోపాటు తమ యొక్క లక్ష్యాలను మర్చిపోకుండా ఉత్తమ విద్యార్థులుగా నిలిచి తమ తల్లిదండ్రుల ఆశయాలను అధ్యాపకుల యొక్క ఆశయాలను నెరవేర్చాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ గురించి వ్యాసరసేన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్, మరియు ఎన్ఎస్ఎస్ పిఓ శివరామయ్య సిబ్బంది, జయచంద్ర రెడ్డి, నోములమ్మ, అమరావతి, నాగమోహన్, రాజ వర్ధనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎస్పీసీఎల్ కు భూమి కేటాయింపుపై ప్రతిపాదనలు పంపండి

### -జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**రాయచోటి ప్రతినిధి, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి లీజ్ ప్రాతిపదికన భూముల కేటాయింపుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆలస్యం చేయకుండా వెంటనే పంపించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం విజయవాడలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి సీసీఎల్ఏ జయలక్ష్మి ఆధ్వర్యంలో సంబంధిత జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో భూ కేటాయింపుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రావణి తదితర అధికారులు. ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి గాలివీడు సోలార్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం గతంలో భూమి కేటాయింపు ప్రతిపాదనను సమర్పించారు. ఈ గాలివీడు సోలార్ పవర్ ప్రాజెక్ట్ సంబంధించిన తూము గుంట, వెలిగల్లు కు సంబంధించిన లీజ్ ప్రక్రియ పనులను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం తయారుచేసి ఫైళ్లను వేగవంతం చేయాలని, శనివారం లోపు నివేదికలను పంపే విధంగా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## టి.బి రహిత సమాజ స్థాపనకై మైభారత్ వాలంటీరుగా చేరుదాం

### - డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ



**మదనపల్లె,మేజర్ న్యూస్ :** టి.బి.వ్యాధి లేని సమాజ స్థాపన కకొరకు మై భారత్ వాలంటీరుగా చేరుదామని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ,టి.బి.పర్యవేక్షకులు ప్రభాకర్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి వారి ఆదేశానుసారం స్వస్థ నారీ – సశక్త పరివార్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని జ్ఞానాంబికా డిగ్రీ కళాశాల,బి.టి కళాశాల విద్యార్థులకు టి.బి వ్యాధి (క్షయ) లేని సమాజం నిర్మాణం కొరకు విద్యార్థులు మై భారత్ వాలంటీరుగా చేరి టి.బిపై యుద్ధం చేయడానికి ఎలా సన్నద్ధం కావాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ మై భారత్ వాలంటీర్ పోర్టల్ నందు ఎన్.ఎస్.ఎస్ (జాతీయ సేవా పథకం) వాలంటీర్లు అందరు నమోదు చేసుకొని నవ భారత నిర్మాణం,నైపుణ్య అభివృద్ధి,శిక్షణ, కౌన్సిలింగ్, మానసిక పరిపక్వత,మనోధైర్యం నింపడానికి ఉండాల్సిన లౌక్యం వంటి వాటిపై ఆన్లైన్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. టి.బి.రోగుల పట్ల వివక్షత చూపడం,వారిలో మానసిక ధైర్యం నింపడం,టి.బిని జయించిన వారిని రోల్ మోడల్ గా చూపడం,టి.బి రోగులకు పౌష్టికాహార మద్దత్తు ఇవ్వడానికి యువతను,సమాజాన్ని చైతన్య పరచడం,టి.బి రోగుల పట్ల ఉన్న సామాజిక కలంకాన్ని లేకుండా చేయడం,టి.బి వ్యాధి పరీక్షలకు సిగ్గులేకుండా ముందుకు రావడం,టి.బి.రోగులు క్రమం తప్పకుండా మందులు తింటూ, పరీక్షలకు రావడం,టి.బి పరీక్షలకు అర్హత కలిగిన వారందరినీ ప్రోత్స హించి టి.బి పరీక్షలు చేయించి వ్యాధి నిర్ధారణ తరువాత చికిత్సలో పెట్టడం,ఫాలో యాపులు చేయడం,ఆర్థిక చేయూత ఇవ్వడం తద్వారా టి.బి లేని సమాజం నిర్మాణంలో మైభారత్ వాలంటీర్ పాలుపంచు కోవాలని పిలుపునిచ్చారు. టి.బి.రోగులకు పౌష్టికాహారం ఇవ్వడానికి వారిని దత్తత తీసుకోవడానికి ప్రిన్సిపాల్ రాఘవ రెడ్డి,ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ శైలజ,విద్యార్థులు ముందుకు రావడం హర్షనీయం. టి.బి.వ్యాధి ఒక బాక్టీరియా ద్వారా వస్తుందని తెలిపిన వారు రాబర్ట్ కాక్ అనీ,రెండు వారాలకు పైబడి దగ్గు,రోజు రాత్రి పూట జ్వరం రావడం,ఛాతిలో నొప్పి,గస,ఆయాసం,నీరసం, బరువుతగ్గడం, ఆకలి లేక పోవడం,గళ్ళ పడుతుంది,రక్తం చక్కలు గళ్ళలో కనిపించడం వంటి లక్షణాలు ఉంటే టి.బి.వ్యాధి అని అనుమానించి ఆశా కార్య కర్తను సంప్రదించి ప్రభుత్వ అస్పత్రిలో గళ్ళ పరీక్షలు చేయించాలన్నారు. టి.బి.వ్యాధి ఒకరి నుండి మరొకరికి నోటి తుంపరలు ద్వారా వ్యాపిస్తుందని,ఈ నోటి తుంపరలు గాలిలో చేరి అందులోని బాక్టీరియాలను ఆరోగ్యవంతులైన మనలాంటి వారు పీల్చడం వల్ల మనకు కూడ టి.బి.వస్తుంది అన్నారు. గళ్ళ పరీక్షలో ఒకవేళ వ్యాధి ఉందని నిర్ధారణ ఐతే ఆరు నెలలు మందులు డాట్స్ ఆధ్వర్యంలో తినాలి. చికిత్స కాలంలో రోగికి ప్రధానమంత్రి పోషణ అభియాన్ పథకం కింద రూ.1000 వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడానికి అని తెలిపారు. విద్యార్థులు మంచి పౌష్టికాహారం తీసుకుని వ్యాధినిరోధక శక్తిని పెంచుకుంటే టి.బి.వచ్చే అవకాశం చాలా తక్కువ అన్నారు.. అనంతరం విద్యార్థులు బర్త్ డే, ఫ్రెండ్ షిప్ డే వంటి సరదా వినోదాలకు డబ్బులు వృధా చేయకుండా ఒక టి.బి రోగికి పౌష్టికాహార సపోర్ట్ ఇస్తే బాగుంటుందని తద్వారా రోగిలో ఇమ్యూనిటీ పెరిగి త్వరగా కోలుకుంటారన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు విద్యార్థులు మద్దతుగా నిలవాలని పిలుపు నిచ్చారు. అనంతరం విద్యార్థుల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి,రాఘవ రెడ్డి,కోఆర్డినేటర్ శైలజ,శ్రీనివాస్ అధ్యాపకులు, అధ్యాపక బృందం మదనపల్లి టి.బి.యూనిట్ సిబ్బంది సుశీల, వనజ కుమారి,తరుణ్,సునీత విద్యార్థులు పాల్గొన్నారు.

## వినూత్నంగా పుచ్చకాయతో జన్మదిన వేడుకలు

### -వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు




**రాజంపేట మేజర్ న్యూస్:** వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాజంపేట పట్టణంలోని భారతీయ విద్యానికేతన్ స్కూల్లో ఎంజిఎఫ్ అడ్వకేట్ కరణం శివశంకర్ నాయుడు జన్మదిన వేడుకలను వినూత్నంగా కేకులకు స్వస్తి చెప్పి పుచ్చకాయను కోసి బుధవారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ చైర్మన్ కొండూరు శరత్ కుమార్ రాజు మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ రాజంపేట 500 మెంబర్స్ కలిగిన గొప్ప క్లబ్ అని, రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాలలో విరివిగా మెగా ఐ క్యాంపులు, మెడికల్ క్యాంపులు, ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు సేవా కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. వాకర్స్ ఇంటర్నేషనల్ చరిత్రలో ఒకేరోజు 108 మంది సభ్యత్వం పొందడం సభ్యుల నిదర్శనం అన్నారు. బ్రిటిష్ కాలం నాటి సాంప్రదాయాన్ని పక్కనపెట్టి కరణం శివశంకర్ నాయుడు జన్మదినాన్ని ఒక వినూత్నమైన సాంప్రదాయంతో జరగడం ఆనందదాయకంగా ఉందన్నారు. ప్రజలందరూ కూడా భవిష్యత్తులో తమ జన్మదిన వేడుకల ను కేట్లు కట్ చేసి సంబరాలు జరుపకుండా, స్వచ్ఛమైన తాజా పండ్లు ను కట్ చేసి నిర్వహించాలని పిలుపునిచ్చారు. చివరగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శి సుబ్బరామరాజు, వెంకటయ్య నాయుడు, కొండూరు శరత్ కుమార్ రాజు, అమ్మినేని వెంకటయ్య నాయుడు, చేజర్ల సుబ్రహ్మణ్యం రాజు, దగ్గుపాటి రవి, శివరామరాజు, సుబ్బరాజు, శ్రీనివాసులు నాయుడు, జయచంద్ర రాజు, రఘువీర్ రాజు, కొమ్మి రామచంద్ర, రామచంద్ర రాజు, రెడ్డయ్య, బాలాజీ, మె డికొండు రవి, నాసర్, మురళి, మోహన్ రాజు, సుధీర్, మల్లికార్జున, అమర్, శంకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## టీకాల కార్యక్రమం ఆకస్మిక తనిఖీ



**వీరబల్లి, మేజర్ న్యూస్:** వీరబల్లి మండలం పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ డి మాలకొండయ్య వీరబల్లి పశువైద్యశాలను సందర్శించి మండలంలో ఏడవ విడత గాలికుంటు టీకాలు గురించి క్షేత్రస్థాయి సిబ్బంది ప్రణాళిక ప్రకారం గాలికుంటు టీకాలు కార్యక్రమాన్ని పరిశీలించడం జరిగింది. మండలానికి 6500 డోసులు ఇవ్వడం జరిగింది. 2025 వరకు 2249 పశువులకు టీకాలు వేయడం అయినది ఈ కార్యక్రమము ఈనెల 15వ తేదీ నుండి రేపు నెల 15 వరకు అన్ని గ్రామాలలో రైతు సేవ కేంద్రాల సిబ్బంది టీకాలు వేయడం జరుగుతున్నది. ఈరోజు మండల పశు వైద్యాధికారి డాక్టర్ డి గణేష్ వారి ఆధ్వర్యంలో ఉపసంచాలకులు దూళ్ల హరిజనవాడ , పిచ్చిగుంటపల్లి, నాయనవారిపల్లి, వంగిమల నాగిరెడ్డి గారి పల్లి యందు టీకా కార్యక్రమము తనిఖీ చేయడం జరిగింది. మరియు సిబ్బందికి తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా దుళ్ళ హరిజనవాడ నందు రైతులకు గాలికుంటు టీకాలు పట్ల అవగాహన కల్పించడమైనది.






## సుబ్బారావుకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు-2025

**రాజంపేట, మేజర్ న్యూస్:** ద్యుమాట్రిక్స్ ఫౌండేషన్ ప్రకటించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డు-2025ను ఆచార్యడాక్టర్ ఎం.సుబ్బారావు అందుకున్నారు.డాక్టర్ సుబ్బారావు బోధన, పరిశోధన, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలలో దీర్ఘకాలంగా అచంచలమైన కృషి చేసి, ఉన్నత విద్యా రంగానికి విశేషమైన సేవలు అందిస్తున్నారు. ప్రత్యేకించి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో ఆయన చేసిన వినూత్న పరిశోధనలు, సృజనాత్మక బోధన పద్ధతులు, విద్యార్థులలో ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించడంలో ఆయన చూపిన దూరదృష్టి అపూర్వం.ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు ఆయన విద్యారంగానికి చేసిన అమూల్యమైన కృషికి లభించిన గౌరవప్రదమైన గుర్తింపు. అన్నమాచార్య యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఈ. సాయిబాబా రెడ్డి, అలాగే ఏఐటిఎస్ రాజంపేట ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. ఎం. వి. నారాయణ డాక్టర్ సుబ్బారావు విజయంపై అభినందనలు తెలిపారు. సహచరులు, విద్యార్థులు, స్నేహితులు ఆయన విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## లోక్ కళ్యాణ మేళాను సద్వినియోగం చేసుకోండి

### -మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాసులు




**రాజంపేట,మేజర్ న్యూస్:** కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూపొందించిన "లోక్ కళ్యాణ మేళా" ను వీధి విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాసులు మెప్మా పదక సంచాలకులు ఇచ్చారు పిలుపునిచ్చారు.మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, పీఎం స్వనిధి 2.0 లో భాగంగా వీధి విక్రయదారులకు రుణ సదుపాయాలు, క్రెడిట్ హామీ, వడ్డీ సబ్సిడీ, డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహకాలు లభిస్తాయని తెలిపారు. మొదటి విడతలో రూ.15,000, రెండవ విడతలో రూ.25,000 రుణాలు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా యుపిఐ లింక్ రూపే క్రెడిట్ కార్డులు గరిష్టంగా రూ.30,000 వరకు అందజేస్తారని తెలిపారు. లేబర్ డిపార్ట్మెంట్ అధికారులు మాట్లాడుతూ, పీఎం శ్రమయోగి మందాన్ పెన్షన్, పీఎం సురక్ష భీమా యోజన, పీఎం జీవన్ జ్యోతి భీమా యోజన, పీఎం జనధన్ యోజన వంటి పథకాల ద్వారా ప్రతి అసంఘటిత రంగ కార్మికులు ప్రయోజనం పొందాలని సూచించారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్, ఐసిడిఎస్, బ్యాంకు ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. కమిషనర్ అందరు వీధి విక్రయదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు సచివాలయం సిబ్బంది మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# వర్షం పడితే రాకపోకలు బంద్

- కొన్ని యేండ్ల గా ఇదే తంతు.
- పరిష్కారం దొరకని సమస్యగా ఉంది.
- ఆర్. యు .బి. నీ నామమాత్రం గా వేశారు.
- ప్రక్కన కాలువలో నీళ్ళు వస్తె ఆర్.యు.బి. ఫుల్.
- నాయకులు ఈ సమస్య పై మాట్లాడితే ఒట్టు.
- ప్రజలకు తప్పని అగచాట్లు.

**నందలూరు మేజర్ న్యూస్:**నందలూరు మండలం లోని నాగిరెడ్డి పల్లి మేజర్ పంచాయతీ పరిధిలో గల అరవపల్లి గ్రామం, నాగిరెడ్డి పల్లి గ్రామం మధ్య ఉన్న రైల్వే గేటు ఉంది. అది రైలు రాకపోకల ఎక్కువ గా ఉండడం వలన రైల్వే అధికారులు రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్. యు. బి)నీ ఏర్పాటు చేశారు. రైల్వే గేటు మూసినప్పుడు ప్రజలు, వాహన దారులు ఈ రైల్వే అండర్ బ్రిడ్జి మార్గాన వెళ్ళేవారు. ఈ రైల్వే అండర్ బ్రిడ్జి చెయ్యేరు నది నుండి కన్యక చెరువు ను నింపడానికి నీళ్లు వదిలే కాలువ ప్రక్కన నిర్మించడం జరిగింది. దాని వల్ల ఎప్పుడు వర్షాలు వచ్చిన కాలువలో నీళ్లు రావడం జరిగితే అప్పుడు ఈ ఆర్. యు. బి. నీటి తో నిండి గ్రామాల మధ్య రాకపోకలు సాగేవి కావు. రైల్వే గేటు ద్వారానే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యపై స్థానికంగా ఉన్న నాయకులు వర్షాలు వచ్చినపుడు గతం జరిగిన తప్పిదాలను గురించి చెప్పడం తప్ప ప్రస్తుతం జరగ వలసి దానిపై దృష్టి సాధించలేక పోవడం గమనార్హం. ప్రతి సారి ఈ ఆర్. యు.బి. నీళ్లు వచ్చినపుడు ఇక్కడికి వచ్చి వర్షాలు తగ్గినవెంటనే శాశ్వత పరిష్కారం చేస్తాం అని చెప్పి ... తర్వాత ఇటు వైపు చూసే వారు లేకపోవడం మాములు అయి పోయింది అని ప్రజలు విమర్శలు గురిపిస్తున్నారు. ఈఆర్.యు . బి. వర్షా కాలంవస్తె నీటితో సంగం వరకు ఉండి ప్రయాణాలకు ఇబ్బంది కరంగా ఉండడం జరుగుతుంది. ఆ సమయంలోలో గేటు తిస్తేనే గ్రామాల మధ్య రాకపోకలు జరుగుతాయి, గేట్ ఒక్కోసారి గంట వరకు పడిన ఆగి వుండాల్సిన పరిస్థితి, సమస్యపై మాట్లాడే నాయకులు లేరని స్థానికులు విమర్శిస్తున్నారు. సామాన్యులకు మాత్రం అగచాట్లు తప్పడం లేదు. దీనిపై ఇకనైనా ముందుకు వచ్చి శాశ్వత పరిష్కారం చుతారో.. లేక మనకు ఎందుకు లే.. అని నిమ్మకుండి పోతారో..? వేచి చూడాలి.

# విధాత చలనచిత్రం అతిగొప్ప విజయం సాధించాలి

- పోస్టర్ల ఆవిష్కరణ వేళ ప్రముఖుల ఆకాంక్ష
- ప్రీమియర్ షోకు పెద్దఎత్తున జరుగుతున్న సన్నాహాలు
- ఆదరించాలని ఏబిసి ప్రొడక్షన్స్ అధినేత, చిత్రనిర్మాత డాక్టర్ అప్పినపల్లి విజ్ఞప్తి

**మదనపల్లె,మేజర్ న్యూస్ :** ప్రముఖులు,అభిమానుల కరతాలధ్వనుల మధ్య 'విధాత' చలన చిత్రం పోస్టర్లు విడుదల చేశారు.మంగళవారం మదనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మనుజా రెడ్డి మధ్యాహ్నం వారి స్వగృహంలో విధాత పోస్టర్లను చిత్ర నటుడు నిర్మాత,దర్శకుడుతో కలసి ఆవిష్కరించారు.అదేవిధంగా రాత్రి మదనపల్లి పట్టణంలో స్థానిక కోటవీధిలో గల జయేంద్ర భవనంలో డాక్టర్ అప్పినపల్లి



భాస్కరాచారి, మణికంఠ రాజేంద్ర బాబు దర్శకత్వంలో నటించి,నిర్మించిన విధాత చలనచిత్రం తన పుట్టినరోజు సందర్భంగా చిత్రంలోని నటి నటులు,పుర ప్రముఖులు,స్వర్ణకార సంఘం సభ్యులు,అభిమానులు మధ్య పోస్టర్లు ఆవిష్కరణ జరిగింది.పోస్టర్లు ఆవిష్కరణ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.విధాత చిత్రం పోస్టర్లు విడుదల కార్యక్రమానికి చిత్ర దర్శకత్వం,ఎడిటింగ్ కెమెరామెన్ మణికంఠ రాజేంద్ర బాబు,రచయిత అప్పలపట్ల సురేష్,ప్రతి నాయకుడు శ్రీనివాసులు నాయుడు,నటుడు నాగరాజు,ప్రముఖులు డాక్టర్ ఎన్.ముని గోపాల కృష్ణ,జగన్మోహన్,డాక్టర్ గొల్లపూడి తిరుపతి రావు,మరసం ప్రధాన కార్యదర్శి లింగాల యుగంధరాచారి,రామ్మూర్తి నాయుడు,నరసింహచారిలు హాజరయ్యారు.అలాగే ఏబిసి అభిమానులు, స్వర్ణకార సంఘం సభ్యులు చిన్న,విశ్వ,జయేంద్ర, ప్రభాకర్, నారాయణ, రవి,సిరాజ్, శంకరలుబ్యానర్లు, పోస్టర్ అద్వితీయంగా అలంకరించి జన్మదిన పోస్టర్లు,పుట్టినరోజు వేడుకలు నిర్వహించ డం జరిగింది.ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వక్తలు మాట్లాడుతూ మదనపల్లికి చెందిన డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి నటనపై ఉన్న ఆసక్తితో హైదరాబాద్ ఫిలిం ఛాంబర్ నందు ఏబిసి ప్రొడక్షన్స్ ను రిజిస్టర్ చేసి అందులో భాగంగా విధాత చలన చిత్రాన్ని ప్రేక్షకుల మనసులను,ప్రేక్షకుల మనసులకు హత్తుకునే విధంగా ఎక్కడ రాజీపడకుండా నటించి నిర్మించడం మదనపల్లికి గర్వకారణమన్నారు. వెండితెరపైన ఈ చిత్రాన్ని చూసే అవకాశం ప్రేక్షకులకు కలగడం సంతోషించదగ్గ విషయమన్నారు. చలనచిత్ర రంగంలో మదనపల్లికి చెందిన నటుడు,నిర్మాతగా ఆయనకు ప్రజలందరి సహకారం,మద్దతు ఎంతో అవసరం ఉందని చిత్రాన్ని ప్రతి ఒక్కరూ చూసి ఆశీర్వదించాలని కోరారు.మదనపల్లి పట్టణం పరిసరాలతోపాటు స్థానిక నటీనటులతో తెరకెక్కిన చిత్రం అధ్యంతం ఆకట్టుకునేవిధంగా ముందుకు సాగుతుందన్నారు. చిత్ర దర్శకులు మణికంఠ రాజేంద్ర బాబు మాట్లాడుతూ అక్టోబర్ నెలలో వెండి తెరపై సినిమా విడుదలకు సిద్ధమవుతోందని,అంతకు ముందే ప్రీమియర్ షోకు పెద్దఎత్తున సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.ప్రేక్షకుల మనస్సును హత్తుకునేలా చిత్ర నిర్మాణం ఉంటుందని చిత్ర యూనిట్ విశ్వాసం వ్యక్తం చేసింది.ఏబిసి ప్రొడక్షన్స్ అధినేత,విధాత చలన చిత్రం నటులు,నిర్మాత అప్పినపల్లి భాస్కరాచారి మాట్లాడుతూ విధాత చిత్ర నిర్మాణంలో ఎక్కడా రాజీపడకుండా అన్నివిధాల ప్రత్యేక శ్రద్ధతో నిర్మించడం జరిగిందని కావున ప్రేక్షక దేవుళ్ళు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ చిత్ర నిర్మాణానికి అన్నివిధాల సహాయ,సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.పోస్టర్ల విడుదల కార్యక్రమాన్ని జయప్రదం చేయడంలో అభిమానులు,స్వర్ణకారులు చూపించిన చొరవ అభినందనీయమని కొనియాడుతూ ధన్యవాదాలు చెప్పారు.ఈ కార్యక్రమంలో శ్రేయోభిలాషులు సుజుకి షోరూం అధినేత ఆదినారాయణ,మిట్స్ కళాశాల రేడియో స్టేషన్ డైరెక్టర్ నరసింహచార్యులు పాల్గొన్నారు.



సూర్య
www.suryaa.com



## కెవిపల్లి పాఠశాల విద్యార్థులకు ఇంటర్న్ షిప్



**కేవి పల్లి మేజర్ న్యూస్:** అన్నమయ్య జిల్లా కె.వి పల్లి మండలం లోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులను ఉపాధ్యాయ బృందం ఇచ్చిన సూచనల మేరకు ఏపీ మోడల్ స్కూల్లో 10 వ తరగతి చదువుచున్న ఐటి, ఐటిఈఎస్,ట్రేడ్స్ విద్యార్థినులు సాయి వైష్ణవి, తేజశ్రీ,అర్చిత, అలేఖ్య, తనుశ్రీలు ఈ నెల22/9/2025 నుండి 4-10-2025 వరకు జరుగు. ఇంటర్ షిప్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామ సచివాలయం నందు శిక్షణ పొందుచున్నారు.సమగ్ర శిక్షా ఆంధ్ర ప్రదేశ్ శ్రీనివాస రావు స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో పియంయస్ మరియు సమగ్ర శిక్షణ స్కీమ్ లో ప్రభుత్వ పాఠశాలల్లో 2716 ఒకేషనల్ ట్రైనర్లుగా 2017 నుండి పని చేస్తున్నాము. ఏపీ స్టేట్‌లో 10 ట్రేడ్స్‌తో 28 ఒకేషనల్ కోర్సులు ప్రారంభించడం జరిగింది. ఇందులో భాగంగా యస్‌పిడి ఆదేశాల మేరకు వృత్తి విద్యలో శిక్షణ తీసు కోవడం కోసం ఏపీ మోడల్ స్కూల్ ఒకేషనల్ ట్రైనర్ జి. గురుస్వామి పర్యవేక్షణలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శ్రీను నాయక్ మరియు మొదటి రోజు కేవీ పల్లి విద్యాశాఖ అధికారులు ఎంఈఓ రెడ్డి భాష కార్య క్రమం లో పాల్గొన్నారు.

## ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ పౌండేషన్ డే




**మదనపల్లె రూరల్, మేజర్ న్యూస్ :** పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల నందు ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డే నిర్వహించారు.ఈ కార్య క్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్థానిక చంద్రమాకుల పల్లెలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ పచ్చదనాన్ని విస్తరించడం ద్వారా వాతావరణ మార్పులను ఎదుర్కోవడం,గ్రామీణ ప్రాంతాలలో పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటం,కాలుష్యాన్ని తగ్గించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు.ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయుడు మాట్లాడుతూ చెట్లు భూమి ఉష్ణోగ్రత తగ్గించడంలో జీవవైవిధ్యాన్ని కాపాడడంలో కీలకమని గుర్తు చేశారు.అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్కనాటి దాన్ని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించగలుగుతామని విద్యార్థులు పుస్తకాలతోపాటు సమాజం పట్ల బాధ్యతను కూడా నేర్చుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకుడు బి.దర్శన్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్ఎస్ఎస్‌డే వేడుకలు

**పీలేరు మేజర్ న్యూస్:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సేవా పథకం ఏం సుధాకర్ రెడ్డి ప్రిన్సిపల్, ఎన్ ఎస్ఎ స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు దేశభక్తి , దేశం పట్ల గౌరవం, సేవా దృక్పథాలను అలవరుచు కోవడం వల్ల మన దేశం ప్రగతి పథంలో నడిపించవచ్చని ఆయన అన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సహదేవ మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ సేవా పథకం ద్వారా వారిలో సామాజిక దృక్పథం పెంపొందించబడి అనేక సామాజిక కార్యక్రమాలలో, సేవా కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా ఉత్తమ దేశ పౌరులుగా మార్చవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, మొక్కలు నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# శ్రీ సాయిలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహణ






**రాయచోటి ప్రతినిధి, మేజర్ న్యూస్ :** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నాడు ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా రాయచోటి పట్టణానికి చెందిన నవ్యత క్లినిక్ నిర్వాహకురాలు డాక్టర్.చమర్తి నవ్యత (డెర్మటాలజీ) హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్యత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థనారి- సశక్తు పరివార అభియాన్ పథకం కింద ప్రతి కుటుంబంలోని మహిళల ఆరోగ్యం కోసం అనేక చర్యలు చేపట్టిందని, వివరిస్తూ ప్రతి కుటుంబంలో మహిళ ఆరోగ్యకరంగా ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, మహిళ సాధికారత సాధించినప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందంజలోఉంటుందని అభిప్రాయపడ్డారు. పరిపూర్ణమైన ఆరోగ్యం కోసం యోగ, సమీకృత ఆహారం, రెగ్యులర్ హెల్త్ చెకప్ అంశాలపై సూచనలు సలహాలు వివరించారు. కళాశాల డైరెక్టర్ హీరా రాజపుత్ మాట్లాడుతూ విద్యార్థన దశలో జాతీయ సేవా పథకం ప్రతి విద్యార్థి జీవితాన్ని బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తుందని వివరించారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ పథకం ద్వారా విద్యార్థుల్లో సేవా గుణాన్ని అలవర్చి, సమాజంలో ఐక్యత ఏర్పరిచి, ఆచార సంప్రదాయాలు పై అవగాహన ఏర్పరిచి గౌరవప్రదమైన పౌరునిగా తీర్చిదిద్దుతుందని వివరించారు. మహిళలకు స్వేచ్ఛ స్వతంత్రాలను కల్పించినప్పుడు అన్నిరంగాల్లో దేశం ప్రగతి సాధిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రక్తదానం చేసిన ఎన్ఎస్ఎస్ సభ్య విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అతిధిని మరియు విశిష్ట అతిథిగా హాజరైన ప్రజా చైతన్య సేవా సంఘం అధ్యక్షురాలు తుమ్మల స్వాతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





# శ్రీచౌడేశ్వరి దేవి ఆలయంలో కన్నుల పండుగలా నవరాత్రి ఉత్సవాలు

**మదనపల్లె టౌన్,మేజర్ న్యూస్ :** నీరుగట్టువారిపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు కన్నులపండుగలా కొనసాగుతున్నాయి.ఈ వేడుకలకు పెద్దఎత్తున భక్తులు హాజరై జయప్రదంచేయాలని ఆలయకమిటీ పిలుపునిచ్చింది. బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి వేడుకల కరపత్రాలను విడుదల చేశారు.ఈ కార్యక్రమానికి ఆలయకమిటీ గౌరవ అధ్యక్షులు మోడెం వెంకటరమణ, అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్,గౌరవ ఉపాధ్యక్షులు మోడెం సిద్ధప్ప, నీలకంఠ,బండి నాగరాజు,జి.లక్ష్మీ నారాయణ,శ్రీరామ్ చినబాబు, కొరముట్ల నాగరాజు,ఉప్పు రామచంద్ర,ఆర్.కే.మోహన్, కోశాధికారి రామిశెట్టి రత్నమయ్య,కార్యదర్శి పవన్ కుమార్,మార్కెట్ పాలక వర్గం వైస్ చైర్మన్ రామిశెట్టి ఆంజనేయులు,కౌన్సిలర్ మందపల్లి వెంకటరమణ, ఎస్.వి రమణ,ఆర్.శివలు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో భక్తిశ్రద్ధల నడుమ నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు.అంగరంగ వైభవంగా జరిగే వేడుకలకు పెద్దఎత్తున అమ్మవారి భక్తులు,పురప్రజలు హజరై విజయవంతం చేయాలని కోరారు.ఇందులో భాగంగా బుధవారం అమ్మవారు కుంకుమ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం కనకదుర్గా అలంకారం,శుక్రవారం వెండి కవచం అలంకారం,శనివారంఅన్నపూర్ణేశ్వరి అలంకారం,ఆదివారం శాకాంబరి అలంకారం,సోమవారం సరస్వతి అలంకారం, మంగళవారం మహిషాసుర మర్ధిని అలంకారం,బుధవారం ధనలక్ష్మి అలంకారం, గురువారం రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు.దసరా వేడుకలను పురస్కరించుకొని ఆలయంలో ప్రతిరోజు ఉదయం అమ్మవారికి పంచామృతా భిషేకం, తీర్థ ప్రసాద వినియోగం,సాయంత్రం ప్రత్యేక అలంకరణ మహా మంగళహారతి తీర్థప్రసాద వినియోగం జరుగుతుందని వివరించారు. శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలలో అమ్మవారి భక్తులు పుర ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కృపాకటాక్షానికి పాత్రులు కావాలని కోరారు.అలాగే వీవర్స్ కాలనీ మహిళా భక్తులచే మహిళా భక్తులకు పసుపు,కుంకుమ,గాజులు,పసుపు దారం నవరాత్రి వేడుకలు జరిగే రోజుల్లో ఇవ్వడం జరుగుతుందన్నారు.అదేవిధంగా వచ్చే నెల రెండో తేదీ విజయదశమి రోజు తొగటవీర క్షత్రియ విద్యార్థులకు స్కాలర్షిప్లు పంపిణీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కాగా బుధవారం ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తాదులకు ఆలయ కమిటీ కోశాధికారి రామిశెట్టి రత్నమయ్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.దసరా వేడుకల్లో భక్తులకు ఉదయం అల్పాహారం అందించే అవకాశం కలగడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అమ్మవారి భక్తులు,ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ సేవ పథకం దినోత్సవం



**ములకలచెరువు, మేజర్ న్యూస్:** ములకలచెరువు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళా శాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ డే జాతీయ సేవ పథకం దినోత్సవం ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా కాలేజీ నుండి మూడు రోడ్లు కూడలి వరకు నినాదాలు చేస్తూ విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీగా వెళ్లారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకొని సమాజానికి మార్గదర్శకులు కావాలని అన్నారు. ఎలాంటి ప్రతిఫలం లేకుండా సేవా చేయడమనేది విద్యార్థి యొక్క గుణంగా అలవర్చుకోవాలని మనుషులకి, సమాజానికి సేవ చేసి ఇతరులకి మార్గదర్శకంగా నిలవాలని, విద్యార్థుల సేవా గుణంతోపాటు తమ యొక్క లక్ష్యాలను మర్చిపోకుండా ఉత్తమ విద్యార్థులుగా నిలిచి తమ తల్లిదండ్రుల ఆశయాలను అధ్యాపకుల యొక్క ఆశయాలను నెరవేర్చాలని తెలిపారు.అనంతరం విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ గురించి వ్యాసరసేన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్, మరియు ఎన్ఎస్ఎస్ పిఓ శివరామయ్య సిబ్బంది, జయచంద్ర రెడ్డి, నోములమ్మ, అమరావతి, నాగమోహన్, రాజ వర్ధనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 9 మంది ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్

### రూ.34.40 లక్షల విలువైన 12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం - మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



**రాయచోటి ప్రతినిధి, మేజర్ న్యూస్:** అన్నమయ్య జిల్లా టి. సుండుపల్లె మండలం మాచిరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్నారని సమాచారం మేరకు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు, రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఆర్ ఎస్ టి ఎఫ్ సీఐ మధు, కలికిరి సీఐ అనిల్ టి. సుండుపల్లె పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తొగురుపల్లి క్రాస్ వద్ద ఎర్రచందనం దొంగల కోసం కాపు కాశారు. బుధవారం నాడు మాచిరెడ్డి గారి పల్లె వైపు నుండి ఒక కారు రాగా, దొంగలు మామిడి తోట నుండి ఎర్రచందనం దుంగలను కారులో లోడ్ చేయడానికి ప్రయత్నించారు.కాపు కాసిన పోలీసులు వారిని అడ్డుకోవడానికి ముందుకు వెళ్ళగా, కొంతమంది కారులో ఎక్కి పోలీసులను ఢీకొట్టే ప్రయత్నం చేసి తప్పించుకున్నారు. 9 మందిని పోలీసులు వెంటాడి పట్టుకొని అరెస్ట్ చేశారు. మొత్తం 12 ఎర్రచందనం దుంగలుస్వాధీనంచేసుకున్నారు.వీటివిలువ రూ. 34, 40,000 ఉంటుందని అధికారులు తెలిపారు. అరెస్టయిన వారిలో బాకియరాజ్ అన్నామలై తిరువన్నామలై జిల్లా, రజిత్ కుమార్ గోవిందన్ తిరువన్నామలై జిల్లా, సామినాథన్ జి తిరువన్నామలై జిల్లా, సురేష్ కుమార్ శివ కుమార్ తిరువన్నామలై జిల్లా, దురైసామి ఆర్ వేలూరు జిల్లా, రాజా మణి వేలూరు జిల్లా, పరశాంత్ చంద్రన్ వేలూరు జిల్లా, రాజా విజయ కుమార్ వేలూరు జిల్లా, తిరుమలై చిన్నయాన్ తిరువన్నామలై జిల్లా.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ అరెస్టయిన ముద్దాయిలు ఇచ్చిన సమాచారంతో ఇంకా కొంతమంది స్మగ్లర్లు పారిపోయినట్లు తెలిసింది. వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. ఎర్రచందనం వంటి విలువైన వనరులను అక్రమంగా రవాణా చేయడం, దోపిడి చేయడం కఠిన నేరం. మేము ఈ రకమైన చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పట్టుదలతో చర్యలుతీసుకుంటున్నాం. ఏవరైనా వ్యక్తులు ఎర్రచందనం లేదా ఇతర అటవీ వస్తువులను అక్రమంగా తరలిస్తే, కఠిన చట్టం వర్తింపబడుతుంది, కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు. ప్రజల సహకారం చాలా ముఖ్యం అని, ఈ రకమైన స్మగ్లింగ్ కార్యకలాపాలను చూసినట్లయితే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. మన వనరులను రక్షించడం, నేరాలకు అవకాశాలు ఇవ్వకుండా చేయడం మనం కలసి చేసే బాధ్యత. ప్రజల భద్రత, ప్రకృతి వనరుల రక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారు. కాబట్టి ఎర్రచందనం అక్రమరవాణాజరుగుతుంటేపోలీసులకుసమాచారం ఇవ్వాలనిప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు. తమిళ స్మగ్లర్లను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికా రులు, సిబ్బంది,ఆర్ఎస్టిఎఫ్బృందాన్నిఎస్పీ అభినందించారు.



## మర్యాదపూర్వకంగా మాజీ ముఖ్యమంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే కొరముట్ల



**రైల్వేకోడూరు రూరల్ మేజర్‌న్యూస్ :** రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్ అధ్యక్షతన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనిన అనంతరం వైసిపి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గంలో జరుగుతున్న సమస్యల గురించి వివారించారు. అదేవిధంగా రైల్వే కోడూరు మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు కడప పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలికులు కొండూరు అజయ్ రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## బి.కొత్తకోట ఎంపిడిఓగా బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ షకూర్



**బి.కొత్తకోట,మేజర్‌న్యూస్:** తంబళ్లపల్లి నియోజకవర్గం, బి.కొత్తకోట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా అబ్దుల్ షకూర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణి బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో మదనపల్లిలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఈయనను పదోన్నతిపై బి.కొత్తకోట మండల ఎంపీడీవోగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో అబ్దుల్ షకూర్ మాట్లాడుతూ మండలాన్ని అన్ని విధాలఅభివృద్ధిచేయడానికిశక్తివంచనలేకుండా కృషి చేస్తానని తెలిపారు.అన్ని శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో ముందుకు సాగుతానన్నారు. నూతనఎంపీడీవోకుకార్యాలయసిబ్బందితదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రధాని మోడీ పుట్టినరోజు సందర్భంగా రాజుగుంటపల్లిలో పండ్లు మందులు పంపిణీ





**ఒంటిమిట్ట, మేజర్‌న్యూస్ :** ఒంటిమిట్ట మండలం రాజుగుంటపల్లి పంచాయితీలో భరతమాత ముద్దుబిడ్డ భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మ దినమును పురస్కరించుకొని సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ రెండవ తేదీ వరకు సేవా పక్వాడ్ పక్షోత్సవ కార్యక్రమాల్లో భాగంగా రాజు గుంటపల్లి పంచాయతీలో ఒంటిమిట్ట మండల బిజెపి అధ్యక్షులు రుద్రరాజు భాను ప్రకాష్ రాజు, మండల ప్రధాన కార్యదర్శి కత్తి జగదీష్ కుమార్, ఉపాధ్యక్షులు వెంకటరత్నం ఆధ్వర్యంలో ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ సూపర్వైజర్ భాస్కర్ రెడ్డి, సిహెచ్ ఓటి ఆక్స, ఏఎన్ఎం శశికళ పంచాయతీ లోని ఆశా వర్కర్లు పెంచలమ్మ, నాగరాణి సమక్షంలో బీసీ కాలనీలోని ప్రజలకి జ్వరము దగ్గు జలుబు వొళ్ళు నొప్పులు కాళ్ల నొప్పులు వీటికి మందులు అందించారు అదేవిధంగా ఇంటింటి సర్వే నిర్వహించి లార్వా పెరిగే అవకాశాలు నీరు నిలువ ఉండే చోట ఫినాయిల్, కిరోసిన్, వేస్ట్ ఆయిల్ వంటివి పిచికారి చేసినచో రోగకారకాలైన క్రిములు దోమలు పునరుత్పత్తి చెందకుండా ఉంటాయని తెలియజేశారు. అదేవిధంగా బిజెపి మండల అధ్యక్షులు రుద్రరాజు భాను ప్రకాష్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు డాక్టర్లు మండలంలో ఎస్సీ ఎస్టీ బీసీ ఆర్థికంగా వెనుకబడిన వీధులలో మెడికల్ క్యాంపులు ఎక్కువగా నిర్వహించాలని వాతావరణ పరిస్థితులపై, ఆరోగ్య పరిస్థితులపై అవగాహన సదస్సులువీలైనన్నిఏర్పాటుచేసుకోవాలనిమెడికల్ సూపర్వైజర్ ఆరోగ్య సిబ్బందికి తెలియజేశారు అదేవిధంగా గ్రామాలలోని ప్రజలు ఇంటి లోపల వలె ఇంటిపరిసరప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు.



# నాకు న్యాయం చేయండి సారు..!

**నందలూరు మేజర్‌న్యూస్:** నందలూరు మండలం లోని పాటూరు గ్రామ పంచాయతీ లోని పెద్దూరు గ్రామాల్లో ఉండే కుంచం సురేష్ కుమార్ మరియు జయ లక్ష్మి 2016 సంవత్సరం లో వివాహం జరిగింది. కొద్ది రోజులు బాగానే ఉన్నారు, ఒక బాబు పుట్టాక సురేష్ జీవనోపాధి కోసం కువైట్ వెళ్ళడం జరిగింది . అప్పుడు తన భార్య జయ లక్ష్మి నీ ఆమె అమ్మ గారి ఇంట్లో వదిలి వెళ్ళాడు. కొన్ని రోజుల కి మీ ఇంటి నుండి ను ఆస్తి బాగం తేసుకొని రావాలని తన భర్త సురేష్ మరియు అతని అన్న గోపాల్ కృష్ణ లు వేధించడం మొదలు పెట్టారు అని బాధితురాలు జయలక్ష్మి ఆవేదన్ వ్యక్తంచేశారు. గత ఆరునెలల నుండి తనకు ఫోన్ చేసేవాడు కాదని, మా జీవనం కోసం డబ్బులు కూడా పంపడం మానేశాడని ఆమె ఆరోపించారు. తన భర్త సురేష్ రెండు నెలల క్రితం ఇండియాకు వచ్చిన నాకు సమాచారం కూడా ఇవ్వలేదని, నేను వేరే వాళ్ళ నుండి తెలుసుకొని ఫోన్ చేస్తే నా ఫోన్ బ్లాక్ చేసి ఉన్నాడు అన్నారు. మంగళ వారం సాయంకాలం పాటూరు లోని మాఇంటికి వస్తే సురేష్ ఇంటికి తాళాలు వేసి ఎక్కడికో వెళ్ళాడని , వాళ్ల అన్న గోపాల్ కృష్ణ ఆ ఇల్లు నాది నువ అక్కడ నుండి వెళ్లి పో లేకుంటే నీ అంతు చూస్తా అని బెదిరించాడని ఆమె అంటున్నారు. నా పరిస్థితి మరే ఆడపిల్ల కు రాకూడదు అని ఆమె వాపోయారు. తనకు న్యాయం జరిగే వరకూ నేను ఇంటి బయ టనే కూర్చునే ఉంటా నని ఆమె అంటున్నారు. సమాచారం తెలుసు కున్న పోలీస్ వారు ఆమె వద్దకు వచ్చి పూర్తి సమాచారం తీసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆమెకు న్యాయం జరిగేలా చూస్తామని ఎస్ ఐ మల్లికార్జున రెడ్డి అన్నారు.



మాట్లాడుతున్న బాధితురాలు జయ లక్ష్మి

# సేవా కార్యక్రమాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల పనితీరు భేష్




## – విశ్వం కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ ఆవిర్భావ దినోత్సవం

**కురబలకోట,మేజర్‌న్యూస్** : అంగళ్లు సమీపంలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఎన్.ఎస్.ఎస్. దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా కళాశాల నందు జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక సామజిక సేవకుడిగా మారాలని,విద్యా విధానంలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సమాజంలో అందరికీ ఆదర్శంగానిలవాలనితెలిపారు.వైస్‌ప్రిన్సిపాల్ టి.ఎస్.గౌస్ భాషా మాట్లాడుతూ విద్యార్థులు ఎన్.ఎస్.ఎస్ వాలెంటీర్లుగా బాగా ఎదగాలని వివిధ స్థాయిలలో సమాజానికి సేవలు చేయాలని తెలిపారు.డీన్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డాక్టర్ ఎల్. తిమ్మయ్య మాట్లాడుతూ విద్యార్థుల సేవా కార్యక్రమాల ద్వారా దేశ అభివృద్ధిలో ఎన్నో మార్పులు వస్తాయని,మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. ఎన్.ఎస్.ఎస్.కోఆర్డినేటర్ ఎస్ హర్షద్ అలీ మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా సమాజానికి సామాజిక సేవ చేయాలని విద్యార్థులను కొనియాడారు.అదేవిధంగాక్యాంపస్‌నందుక్లీన్‌అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలియజేశారు.విద్యార్థులు సామాజిక సేవ,సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడం,సామాజిక చైతన్యం,పౌర రక్షణ మరియు వ్యక్తిత్వ వికాసం అలవర్చుకోవాలనిఅదేవిధంగాఎన్ఎస్ఎస్ పథకాలు ప్రశంసాపత్రాలు అందుకోవాలనిడీన్ పబ్లిక్ రిలేషన్స్ పూజారి అంజప్ప విద్యార్థులను కోరారు.




# మంటపంపల్లిలో స్వస్థ నారి స్వశక్తి కార్యక్రమం



**ఒంటిమిట్ట,మేజర్ న్యూస్** : మంటపంపల్లి గ్రామంలో బుధవారం 24వ తేదీనఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ పి.అరుణజ్యోతి ఆధ్వర్యములోస్వస్త్‌నారీసశక్త్‌పరివార్‌కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఇందులో చిన్నపిల్లలకు వాక్సినేషన్,గర్భిణీ పరీక్షలు,పంటి,కంటి పరీక్షలు, కాన్సర్ పరీక్షలు,సికిల్ సెల్,బీపీ,షుగర్ పరీక్షలు చేయడం జరిగినది.గర్భిణీ స్త్రీలకువైద్యాధికారి,సూపర్‌వైజర్‌లక్ష్మీనరసమ్మ,ఐసీడీయస్ సూపర్వైజర్ సుగుణ చేతులమీదుగా శ్రీమంతం జరిపించిడం జరిగినది .పోషకాహారం వలనకలు గులాభాలగురించి అంగన్వాడీ టీచర్లు గర్భిణీ స్త్రీలకు వివరించడం జరిగినది. కార్యక్రమంలొసూపర్వైజర్ లక్ష్మీనరసమ్మ,సిహెచ్‌ఓచంద్రిక, స్త్రీ ఆరోగ్య కార్యకర్తలు సరోజ,ఉమాదేవి అంగన్వాడీ టీచర్లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మదనపల్లెలో భార్యపై భర్త హత్యాయత్నం



**మదనపల్లె టౌన్, మేజర్‌న్యూస్:** మదనపల్లెలో భార్యపై భర్త సల సలా కాలే సాంబారు మీద పోసి హత్యా యత్నానికి పాల్పడ్డాడు. బుధవారం సాయంత్రం మదనపల్లెలో జరిగిన ఘటనపై బాధితురాలు తెలిపిన వివరాలు.. పట్టణంలోని కురవంకలో కాపురం ఉంటున్న రామాంజులు భార్య భారతి (25), జిల్లా ఆస్పత్రిలో రోగులకు డైట్ సరఫరా చేసే వీరభద్ర దగ్గర పనిచేస్తుంది. ఈ క్రమంలో సాయంత్రం విధులకు హాజరైన భార్యపై అనుమానం పెంచుకొన్న భర్త ఆస్పత్రి లోనే కాలే సాంబారు మీద పోసి హత్యా యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు బాధితురాలిని జిల్లా ఆసుపత్రికి తరలించి, చికిత్సలు అందించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రెండవ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా రామానుజులు భారతీయ దగ్గర ఉన్న పిల్లలను బలవంతంగా ఎత్తుకెళ్లాడని తన భర్త పిల్లలను ఏమైనా చేస్తాడని ఆమె ఆరోపిస్తూ ఆవేదన వ్యక్తం చేసింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజారెడ్డి తెలిపారు.

# బద్దిపల్లి గుట్ట హౌసింగ్ కాలనీకు రహదారికి మోక్షం

## – మున్సిపల్ కమిషనర్ జి.వి.పల్లవి చొరవతో దారి ఏర్పాటు



**బి.కొత్తకోట,మేజర్ న్యూస్:** గత మూడు సంవత్సరాలుగా బద్దిపల్లి గుట్ట హౌసింగ్ కాలనీ రహదారి లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఎట్టకేలకు మోక్షం లభించింది.ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్ జి.వి పల్లవి బుధవారం అర్బన్ హౌసింగ్ ఏఈ జియా ఫుజైల్ కు తెలపడంతో వెంటనే స్పందించి బద్దిపల్లి హౌసింగ్ కాలనీ నందు జెసిబి సాయంతో రహదారి మరమ్మతులు చేపట్టి పెద్దపెద్ద గుండ్ల సైతం తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్వరలోనే బద్దేపల్లి కాలనీకి పూర్తి స్థాయిలో రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు.పట్టణ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు.గత కొన్ని రోజులుగా ఇబ్బందులు పడుతున్న కాలనీ ప్రజల సమస్యను పరిష్కరించినందుకుగాను బి.కొత్తకోట మున్సిపల్ కమిషనరుకు కాలనీ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.



# రహదారిపై వెలిగిన వీధిదీపాలు..



**ములకలచెరువు, మేజర్‌న్యూస్** : ములకలచెరువు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన వీధి దీపాలు బుధవారం వెలిగించారు.ఈ సందర్భంగా ఎస్సై నరసింహుడు మాట్లాడుతూ రాత్రిపూట వీధుల్లో వెలుతురును అందించడం ద్వారా దొంగతనాలు, ప్రమాదాలు వంటివి తగ్గించి ప్రజల భద్రతను పెంచుతుంది. వాహనదారులు రోడ్డును స్పష్టంగా చూడటానికి, ప్రమాదాలను నివారించడానికి వీధి దీపాలు సహాయ పడతాయి.రాత్రిపూట వీధి దీపాలు వెలిగితే, వాహనాల వెలుతురుతో ఇబ్బంది పడకుండా ప్రయాణించడం సులభం అవుతుంది అని అన్నారు. జాతీయ రహదారిపైవీధిదీపాలు వెలగడంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

# పేకాట రాయుళ్లపై పోలీసుల మెరుపు దాడి : 7 మంది అరెస్ట్

**రాయచోటి రూరల్,మేజర్‌న్యూస్ :** అన్నమయ్య జిల్లా రామాపురం మండలం చింతవాండ్లపల్లి గ్రామం సుద్దమళ్ళ పంచాయతీ పరిధిలో పోలీసులు ఆకస్మికంగా గాంబ్లింగ్ రైడ్ నిర్వహించి పేకాట రాయుళ్లపై విజయవంతమైన దాడి చేశారు.ఈ ఆపరేషన్‌లో 7 మంది పేకాట రాయుళ్లు అరెస్టు కాగా, వారి వద్దనుండి27,500/-నగదు,3బైకులు,5మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.ఈదాడిజిల్లా ఎస్పీ శ్రీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాల మేరకు, లక్కిరెడ్డిపల్లి సిఐ టీవీ కొండారెడ్డి పర్యవేక్షణలో, లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో సిబ్బందిసమర్థవంతంగానిర్వహించారు.సీఐకొండారెడ్డిమాట్లాడు తూ జూదం, పేకాటవంటిఅక్రమకార్యకలాపాలు సమాజాన్ని దెబ్బతీస్తాయి. ఇలాం టి నేరాలలో పాల్గొనేవారిపై కఠిన చర్యలు తప్పవు.ప్రజలు కూడా ఇటువంటి కార్యకలాపాలనుగమనిస్తేవెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# 27న అండర్ 19 బ్యాడ్మింటన్ ఎంపికలు

**రాజంపేట, మేజర్‌న్యూస్** : వైయస్సార్ కడప ఎస్ జి ఎఫ్ అండర్ 19 బ్యాడ్మింటన్ (షటిల్ )సెలక్షన్స్ డి.ఎస్.ఎ కడప ఇండోర్ స్టేడియంలో ఈనెల 27 శనివారము న జరుగునని అండర్ 19 సెక్రెటరీ తెలియజేశారు. పాల్గొనే క్రీడాకారులందరూ కూడా జనన ధ్రువీకరణ పత్రము, స్టడీ సర్టిఫికెట్ తో ఉదయం 9 గంటల లోపల కడప డీఎస్ ఏ ఇండోర్ స్టేడియంలో రిపోర్ట్ చేయవలసిందిగా కోరడమైనది. వివరాలకుఇన్చార్జెస్ శ్రీమతి శారద 99 855 39 525, మరియు జిలాని భాష పిడి 9440 10 70 80ను సంప్రదించవలసినదిగా ఆయన తెలియజేశారు.

# కార్మికులకు పని గంటల పెంపు దారుణం : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన




**బి.కొత్తకోట,మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కార్మికులకు పని గంటలు పెంచుతూ రాష్ట్ర శాసనసభ ఆమోదించిన తీర్మానం కార్మికులకు ద్రోహం చేయటమేనని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.సలీం బాషా తీవ్రంగా విమర్శించారు. బుధవారం బి.కొత్తకోట పట్టణం,పిటిఎం రోడ్డులో ఏఐటియుసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.సలీం బాషా,నియోజకవర్గం అధ్యక్షులు బి వేణుగోపాల్ రెడ్డిలు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్రంలోని టిడిపి,జనసేన, బిజెపిల సంయుక్త కూటమి ప్రభుత్వం యధాతథంగా అమలు చేస్తూ దారుణంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు.అనేక త్యాగాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న 8 గంటల పనివిధా నాన్ని ఒక్క కలం పోటుతో రద్దు చేశారని,కనీసమైన చర్చను సైతం అసెంబ్లీలో జరపకుండా ఏకగ్రీవంగా కార్మిక వ్యతిరేక తీర్మానాన్ని మూడు పార్టీల నాయకులు ఆమోదించారని ఆరోపిం చారు. ప్రస్తుతం ఉన్న ఎనిమిది గంటల పనివిధానం,ప్రతి ఐదు గంటల పనికి గంటసేపు విశ్రాంతి,వారానికి 48 గంటల పనిని 60 గంటలకు మార్చటం,ఓవర్ టైం కింద మూడు నెలలకు 75 గంటల నుంచి 144 గంటలకు పెంచటం వంటి చర్యలు పూర్తిగా యజమానులకు అనుకూల మైనవని,కార్మిక వ్యతిరేక చర్యలని అభివర్ణిం చారు. అలాగే గతంలో మహిళలను రాత్రి షిఫ్ట్ లకు అనుమతిం చేవారు కాదని,ప్రస్తుతం ఈ విధానాన్ని రద్దు చేసి రాత్రంతా పని చేయించుకునే విధానాన్ని తీసుకువ చ్చారని ఇది పూర్తిగా మహిళల పట్ల బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తున్నదన్నారు. కార్మికు లకు వేతనాలు సరిపోవటం లేదని,పెరిగిన ధరలు వస్తున్న జీతాలకు హస్తమశకాంతం తేడా ఉన్నదని వివరిం చారు.వేతనాల పెంపు గురించి, వారి జీవన పరిస్థితు లు,ఆదాయం తదితర అంశాలపై మాటమాత్రమైన చర్చ అసెంబ్లీలో లేకపోవడం అన్యాయమ న్నారు. కూటమి ప్రభుత్వానికి కష్టజీవులు పట్ల ఉన్న శ్రద్ధ. ఏ పాటిదోదీన్నిబట్టిఅర్థమవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కార్మిక వర్గం బూర్జువా పార్టీల పట్ల ఉన్న భ్రమలు విడనాడిపెద్దఎత్తునపోరాటాలకుసన్నద్ధం కావాలని, పూర్వీకులుపోరాడి సాధించిన హక్కులను పున రుద్ధరిం చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటీ యూసీ బి.కొత్తకోటమండలవర్కింగ్‌ప్రెసిడెంట్ కే. బాలకృష్ణ, టూవీలర్ మెకానిక్ అధ్యక్షులు ఎస్.మాలిక్, వెల్డర్స్ యూనియన్ అధ్యక్షులు ఎండి షఫీ,కార్పెంటర్ యూనియన్ ట్రెజరర్ ఎస్.గఫూర్, ఏఐటీయూసీ మండల సీనియర్ నాయకులుబషీర్,మండలనాయకులుఎస్. ఖాదర్ బాషా, ఎస్.రియాజ్,ప్రసాద్,ఖలీల్,రమేష్,షౌకత్, సాదిక్,షవకత్ అలీ,శీనా కార్మికులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు.



## మంత్రి సత్య కుమార్‌ను కలిసిన పోతుగుంట

**అన్నమయ్య జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్:** విజయవాడలోని మంత్రి ర్యాంపు రాష్ట్ర మరియు వైద్య విద్య మంత్రి వై సత్యకుమార్ ని బుధవారం మర్యాదపూర్వకంగా శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ చైర్మెన్ పోతుగుంట రమేష్ నాయుడు కలవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రికి స్వామి వారి వస్త్రము మరియు ప్రసాదము అందజేయడం జరిగింది. వారికి సత్కరించి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన ఆలయము కనుక చక్కగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ తన మార్పు పరిపాలన చూపించాలని వారు తెలిపారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదని, శివుని సన్నిధిలో సేవ చేసే భాగ్యం దొరకడం గొప్ప వరంగా భావించి శ్రీశైలంలో పవిత్రతను కాపాడుతూ భక్తులకు స్వామివారి కటాక్షం లభించేలా చర్యలు చేపట్టాలని మంత్రి చైర్మన్ కు సూచించారు.

## స్వాస్థ్య ఆసుపత్రిలో అందుబాటులోకి ఆధునిక వైద్యసేవలు

**- టెలి కన్సల్టేషన్ సంచార వైద్యశాల వాహనం ప్రారంభం**

**- సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ 'శ్రీ ఎం' వెల్లడి**



**మదనపల్లె రూరల్,మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాల కోసం టాటా ఎండీ అందించిన ప్రత్యేక టెలి కన్సల్టేషన్,సంచార వైద్యశాల వాహనాన్ని సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ 'శ్రీ ఎం' ప్రారంభించారు.బుధవారం స్వాస్య హాస్పిటల్స్ ప్రాంగణంలో ప్రారంభించిన సంచార వైద్యశాల ద్వారా వైద్యులు నేరుగా గ్రామాల్లోకి వెళ్లి,రోగులకు ప్రాథమిక పరీక్షలు,అవసరమైతే నిపుణల వైద్యసలహాలు తక్షణమే అందించగలిగే సౌకర్యం ఈ వాహనంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఛైర్మెన్ డాక్టర్ గిరీష్ కృష్ణమూర్తి,మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రవి,టాటా ఎండీ మరియు టీం,స్వాస్థ్య హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ,స్వాస్థ్య అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కరుణాకర్,ఆర్ఎంవో డాక్టర్.ఆదర్శ్,స్వాస్థ్య వైద్య బృందం,సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వాస్థ్య హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ అత్యాధునిక ల్యాబోరేటరీ సేవలు స్వాస్థ్య హాస్పిటల్స్ లాబరేటరీ సేవలు న్యూబర్గ్ ఆనంద్ (బెంగుళూరు)తో అవగాహన ఒప్పందం చేసుకుని పూర్తిగా ఆటోమేటెడ్ సిస్టంగా మార్చడం జరిగిందన్నారు.దీనివల్ల అంతర్జాతీయ ప్రమాణాల నాణ్యత గల టెస్టింగ్ అత్యంత ఖచ్చితమైన ఫలితాలు వస్తాయని స్పష్టం చేశారు.తక్కువ సమయంలో రిపోర్టులు అందుబాటులోకి రావడంతోపాటు పేషెంట్ డేటా సురక్షితంగా నిలువ ఉండటం జరుగుతుందన్నారు.అంతేకాకుండా బేసిక్,స్టాండర్డ్, కాంప్రహెన్సివ్, మహిళ, కార్డియాక్,డయాబెటిక్,అనీమియా,సీనియర్ సిటిజన్,చిన్నపిల్లలకు పరీక్షలు అత్యంత సరళమైన ధరల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.స్వాస్థ్య ఆసుపత్రిలో పేద,మధ్య తరగతి ప్రజలకి నాణ్యమైన వైద్యసేవలు అందుబాటు ధరలలో ఉత్తమ ప్రమాణాలతో అందిస్తామన్నారు.



## అన్నపూర్ణాదేవి అవతారంలో వాసవి కన్యకా పరమేశ్వరి

**ఒంటిమిట్ట,మేజర్ న్యూస్:** ఒంటిమిట్ట, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి నవరాత్రులలో మూడవరోజు శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో వాసవి మాత దర్శనమిస్తున్నది. రాత్రి 9 గంటలకు మంత్రపుష్పం,దసహారతలతో మంగళహారతి ,తీర్థ ప్రసాద వినియోగం జరుగును. కావున ఒంటిమిట్టలోని ప్రజలందరూ కన్యకా పరమేశ్వరుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు పోవాలని ఆలయ కమిటీ వారు తెలిపారు.






## అన్నపూర్ణాదేవి అలంకరణతో దుర్గమ్మ

**సిద్ధవటం మేజర్ న్యూస్:** శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా సంబరాలు వై బోవ హితంగా జరుగుతున్నాయి మండలంలోని సాయి నగర్ గ్రామంలో బుధవారం శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గమ్మ, అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణతో 3 వ రోజు భక్తులకు దర్శనమిచ్చింది ఉత్సవాల నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించారు ఆలయ పూజారి అమర్నాథ్ శర్మ బుధవారం మాట్లాడుతూ దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పి ఆర్ బి హ్యాండ్లూమ్ అధినేత పుత్త రామభద్రయ్య కుమారులు, పుత్త బాబు, నాగభూషణం ఆధ్వర్యంలో గత ఏడు సంవత్సరాల నుండి ఉత్సవాలు వై బోవహితంగా జరుగుతున్నాయని ప్రతిరోజు సాయంత్రం ప్రత్యేక కోలాటాలు వచ్చిన భక్తులకు ప్రసాదాలు ఏర్పాటు చేశామని దసరా వేడుకల్లో అమ్మవారిని కొలిచిన భక్తులకు, సకల భోగ్యాలు అనుగ్రహం ఉంటుందని ఆలయ పూజారి అమర్నాథ్ శర్మ తెలిపారు ఈ కార్యక్రమంలో మహిళలు భక్తులు పాల్గొన్నారు

## ఏపీఎస్పీసీఎల్ కు భూమి కేటాయింపుపై ప్రతిపాదనలు పంపండి

### -జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**రాయచోటి ప్రతినిధి, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి లీజ్ ప్రాతిపదికన భూముల కేటాయింపుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆలస్యం చేయకుండా వెంటనే పంపించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులకు సూచించారు.బుధవారం విజయవాడలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి సీసీఎల్ఏ జయలక్ష్మి ఆధ్వర్యంలో సంబంధిత జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో భూ కేటాయింపుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.రాయచోటి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌తో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రావణి తదితర అధికారులు. ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి గాలివీడు సోలార్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం గతంలో భూమి కేటాయింపు ప్రతిపాదనను సమర్పించారు.ఈ గాలివీడు సోలార్ పవర్ ప్రాజెక్ట్ సంబంధించిన తూము గుంట, వెలిగల్లు కు సంబంధించిన లీజ్ ప్రక్రియ పనులను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం తయారుచేసి ఫైళ్లను వేగవంతం చేయాలని, శనివారం లోపు నివేదికలను పంపే విధంగా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.


# పంచాయతీ ప్రజల శ్రేయస్సుకై చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం

– కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి స్పష్టం



**మదనపల్లె రూరల్,మేజర్ న్యూస్** : పంచాయతీ ప్రజల శ్రేయస్సుకై అంకితభావంతో పనిచేస్తున్నామని కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి స్పష్టం చేశారు.బుధవారం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను పంచాయతీలోని ప్రజలకు సచివాలయం నందు అందజేశారు.ఈ సందర్భంగా పసుపులేటి చలపతి మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ సకాలంలో అందజేస్తున్నా మన్నారు.అదేవిధంగా పంచాయతీ అభివృద్ధికై నిర్విరామంగా పనిచేస్తున్నామన్నారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాలైన తాగునీరు,మురుగునీటి కాలువల నిర్మాణం,సిసి రోడ్ల నిర్మాణం,వీధిలైట్లు ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో పూర్తి చేస్తున్నామని,తద్వారా ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు.తనను ఆదరించిన పంచాయతీ ప్రజలకు సేవ చేసుకోవడంలో గొప్ప ఆనందం లభిస్తోందన్నారు. పంచాయతీ అభివృద్ధికి కృషిచేస్తున్న అధికారులకు,సహకరిస్తున్న ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.వార్డులో రేషన్ కార్డుదారులంతా స్మార్ట్ కార్డులను సచివాల యంలో పొందాలని,ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు నాగరాజు,వేమ నారాయణ,రేషన్ కార్డుదారులు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మను దర్శించుకున్న మదనపల్లె బిజెపి నాయకులు



**మదనపల్లె,మేజర్న్యూస్ :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గామల్లేశ్వరి దేవస్థానంలో దేవినవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగ ంగా బుధవారం అన్నపూర్ణా దేవి అలంకా రంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో దుర్గామాతను భారతీయ జనతా పార్టీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్ర కుమార్ రెడ్డి,బిజెపి సీనియర్ నాయకులు విజయ శంకర్,కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ ఓసూరి కిరణ్ కుమార్ తదితరులు శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడుతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ వేదపండ ి తుల ఆశీర్వాదంతోపాటు తీర్థప్రసాదాలు అందుకున్నారు.ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ కనకదుర్గమ్మ కృపాకటాక్షాలతో ప్రజలం తా సుఖసంతో షాలతో జీవించాలని,వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి ప్రతి ఇంట ఆనందం వెల్లివిరియాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నేతృత్వంలో భారతదేశం, కూటమి ప్రభుత్వం నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు.

# గ్రామాలలో అంటువ్యాధులు,దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

– పెద్దమండ్యం మండల వైద్యాధికారి డాక్టర్ హరివర్మ



**పెద్దమండ్యం,మేజర్ న్యూస్** : గ్రామాల్లో అంటువ్యాధులు,దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పెద్దమండ్యం మండల వైద్యాధికారి డాక్టర్ హరివర్మ తెలిపారు.బుధవారం మండల కేంద్రమైన పెద్దమండ్యం, బిక్కా వాండ్లపల్లి,రెడ్డివారిపల్లెలో దోమల నివారణకు పంచాయతీ కార్మికుల చేత స్ప్రే చేయించారు.ఈ సందర్భంగా డాక్టర్ హరి వర్మ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో దోమలు వృద్ధిచెంది అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు.కావున ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.ముఖ్యంగా ఇంటి పరిసరాలలో నీరునిలువ ఉండకుండా చూడాలని,కాచి చల్లార్చిన నీరు తాగాలని,జలుబు, దగ్గు,జ్వరం ఉంటే వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ప్రమీల, ఆశా వర్కర్ అనురాధలు పాల్గొన్నారు.

# శ్రీ గంగమ్మ తల్లి ఆలయంలో పూజలు నిర్వహించిన ముక్కా వరలక్ష్మి

**రైల్వే కోడూరు రూరల్ మేజర్ న్యూస్** : రైల్వే కోడూరు పట్టణంలో నవరాత్రుల సందర్భంగా బుధవారం అమ్మవారికి మూడవ అవతారంగా అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారిని ముక్కా వరలక్ష్మి దర్శించుకున్నారు.అనంతరం శ్రీ గంగమ్మ తల్లి దేవస్థానంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక బలిజ వీధి లోని శ్రీ గంగమ్మ తల్లి దేవస్థానంలో నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రైల్వే కోడూరు నియోజకవర్గం టీడీపీ పార్టీ ఇంచార్జ్ మరియు కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి ఆలయంలో అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీర్వాదం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు భక్తులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

